సాక్షి నిర్మల్

బుధవారం । 29 । మార్చి । 2023



.. ఆధారం తప్పనిసరి

ఆధార్ సవరణల్లో మోసాలను అరికట్టేందుకు యూఐడీఏఐ చర్యలు చేపట్టింది. ఇందుకు గాను సమర్పించే పత్రాల్లో మార్పులు చేస్తూ ఇటీవల నిర్ణయం తీసుకుంది. 8లో▸




బాసర ఆలయ హుండీ లెక్కింపు

బాసర శ్రీజ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయ హుండీలను మంగళవారం లెక్కించారు. 28 రోజుల హుండీ ఆదాయం రూ.29,44,395 నగదు వచ్చింది. 10లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.2/23.6

ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉక్కపోత అధికంగా ఉంటుంది. గాలిలో తేమ స్వల్పంగా పెరుగుతుంది.



న్యూస్‌రీల్

ఐసీడీఎస్‌లో 'పోస్టుకు ముడుపులపై' విచారణ



విచారణ చేపడుతున్న అధికారి శ్రీమతి

భైంసాటౌన్: భైంసా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ పోస్టు విషయమై అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. విచారణ అధికారి శ్రీమతి మాట్లాడుతూ.. కలెక్టర్, డీడబ్ల్యూవో ఆదేశాల మేరకు ఆఫీస్ సబార్డినేట్ పోస్టు విషయంలో జరిగిన తంతుపై విచారణ జరిపినట్లు పేర్కొన్నారు. సీడీపీవోతోపాటు ముగ్గురు అంగన్‌వాడీ టీచర్లు, పోస్టుకు దరఖాస్తు చేసుకున్న ఇద్దరు మహిళలను విచారణ చేసినట్లు వివరించారు. విచారణ నివేదికను డీడబ్ల్యూవోకు అందిస్తామని తెలిపారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



రూట్‌మ్యాప్ పరిశీలిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

భైంసాటౌన్:పట్టణ ప్రజలు పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఈనెల 30న భైంసాలో శ్రీరామనవమి శోభాయాత్ర ఉన్నందున మంగళవారం ఆయన భైంసాను సందర్శించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్, శోభాయాత్ర నిర్వాహకులతో కలిసి రూట్‌మ్యాప్ పరిశీలించారు. ఆయన వెంట సీఐ ఎల్.శ్రీను, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

సీపీఆర్‌పై వైద్య సిబ్బందికి శిక్షణ



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

లక్ష్మణచాంద:రాష్ట్రంలో వయసుతో సంబంధం లేకుండా చాలా మంది గుండెపోటుతో మృతిచెందుతున్నారు. కార్డిక్ అరెస్ట్ అయిన వారికి సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడే అవకాశం ఉండడంతో రాష్ట్ర వైద్య శాఖ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి సీపీఆర్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. న్యూవెల్మల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సమత, లక్ష్మణచాంద పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్ సీపీఆర్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సీపీఆర్ చేసినప్పుడు గుండె స్పందన, ప్రసరణ ఏవిధంగా జరిగి మళ్లీ గుండె కొట్టుకోవడం ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా చేసి చూపించారు. సీపీఆర్ చేసి అనంతరం ఏ విధమైన జాగ్రత్తలు తీసుకుని సమీపంలోని ఆసుపత్రికి వెళ్లే వరకు ఏ మందులు వాడాలో తెలిపారు.

జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం



సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీలు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్ పర్సన్ విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగింది. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం, ప్రణాళిక, ఆర్థిక సేవలపై చర్చించారు. ఇందులో జెడ్పీటీసీలు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, కళావతి, సీఈవో సుధీర్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

పోస్టుల పంచాయితీ!

- మంత్రిపై మహేశ్వర్‌రెడ్డి ఆరోపణలు
- ఏలేటికి పోలీసుల నోటీసులు
- నిరసనగా కాంగ్రెస్ ఆందోళనలు
- దమ్ముంటే నిరూపించాలన్న 'అల్లోల'
- అధికార, ప్రతిపక్షాల మధ్య రచ్చ

నిర్మల్:నిర్మల్ మున్సిపాలిటీలో నాలుగో తరగతి పోస్టుల ముచ్చట మరోసారి తెరపైకి వచ్చింది. 'ముడుపుల' వ్యవహారంపై మళ్లీ రాజకీయ రచ్చ మొదలైంది. అధికార, ప్రతిపక్ష నేతల మధ్య సవాళ్లకు తెర తీసింది. తాజాగా ఏఐసీసీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఇంటికి పోలీసులు నోటీసులు అంటించడంతో పంచాయితీ షురూ అయింది. కాంగ్రెస్ ఆందోళనలు, మహేశ్వర్‌రెడ్డి మంత్రిపై ఘాటుగా విమర్శలు చేయడంతో అధికార పార్టీ ప్రతిస్పందించింది. ఏకంగా ఆత్మీయ సమ్మేళనంలోనే మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మహేశ్వర్‌రెడ్డిపై విరుచుకుపడ్డారు. ఆరోపణలు కాదని, ఆధారాలుంటే బయటపెట్టాలని సవాల్ చేశారు. తాను ముడుపులు తీసుకున్నట్లు తేలితే చట్టప్రకారం ఏ శిక్షకైనా సిద్ధమని స్పష్టం చేశారు. మరోవైపు పట్టణ బీఆర్‌ఎస్ నేతలూ ప్రెస్‌మీట్ పెట్టి ఏలేటిపై మండిపడ్డారు.

కేసు నమోదుతో..

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ అంశంపై ఈనెల 21న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి స్పందించారు. అందులోనే నిర్మల్ మున్సిపాలిటీలోనూ 42 ఉద్యోగాలను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అమ్ముకున్నారని ఆరోపించారు. మంత్రికి భూములు కబ్జా చేయడం, ఉద్యోగాలు అమ్ముకోవడం తప్ప నిరుద్యోగ సమస్యలు పట్టవని విమర్శించారు. దీనిపై బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము ఫిర్యాదుతో పోలీసులు పలు సెక్షన్ల కింద మహేశ్వర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. నోటీసులు ఇవ్వడానికి పోలీసులు ఆయన ఇంటికి వెళ్లగా, ఏలేటి లేకపోవడంతో ఇంటి గోడకు అంటించారు.

ఆందోళనలు.. ఆరోపణలు..

మహేశ్వర్‌రెడ్డిపై కేసుల నమోదు, ఆయన ఇంటికి పోలీసులు నోటీసులు అంటించడాన్ని సీరియస్‌గా తీసుకున్న కాంగ్రెస్ నాయకులు ఈనెల 27న జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేశారు. మహేశ్వర్‌రెడ్డి అంటేనే మంత్రి భయపడుతున్నారని, అందుకే తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని మండిపడ్డారు. దిలావర్‌పూర్‌లో మంత్రి దిష్టిబొమ్మనూ దహనం చేశారు. అనుమతి లేకుండా ఆందోళనలు చేశారంటూ పోలీసులు మళ్లీ కాంగ్రెస్ నేతలపై కేసు నమోదు చేశారు.

లొల్లి పెట్టిన 'ముడుపులు'

గతేడాది నిర్మల్ మున్సిపాలిటీని కుదిపేసిన నాలుగో తరగతి పోస్టుల ఎంపిక మరోసారి తెరపైకి వచ్చింది. 44 పోస్టుల నియామకాల్లో భారీగా అవకతవకలకు పాల్పడ్డారని, భారీ మొత్తం ముడుపులు తీసుకున్నారని, కుటుంబసభ్యులకే పోస్టులు ఇప్పించుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. అప్పట్లో బీజేపీ, కాంగ్రెస్‌లు మున్సిపల్ ముట్టడి, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. పలువురు అభ్యర్థులు కోర్టు వరకూ వెళ్లారు. మొదట మంత్రి, కలెక్టర్ ఆర్డీవో దా విచారణ కు ఆదేశించినా వివాదం ముదరడంతో అప్పటి కలెక్టర్ ముషరఫ్‌అలీ మొత్తానికే రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. తాజాగా ముడుపుల విషయంలోనే మహేశ్వర్‌రెడ్డి మంత్రిపై ఆరోపణలు చేయడంతో మళ్లీ రచ్చ మొదలైంది. ఎన్నికల నేపథ్యంలోనే మంత్రిపై ఆరోపణలు చేస్తున్నారంటూ బీఆర్‌ఎస్ నాయకులు ఎదురు దాడి చేస్తున్నారు.

ఆధారాలుంటే బయటపెట్టు

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్: మున్సిపల్ ఉద్యోగాల నియామకాల్లో మహేశ్వర్‌రెడ్డి తనపై నిరాధార ఆరోపణలు చేయడం కాదని, ఆధారాలుంటే బయటపెట్టాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సవాలు విసిరారు. అసత్య ప్రచారం చేస్తున్నందుకే పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారని స్పష్టం చేశారు. మామడలో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సీరియస్‌గా స్పందించారు. పోలీసులు ఇప్పటికే మహేశ్వర్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారని, తనపై ఆరోపణలకు రుజువులు చూపాలని డిమాండ్ చేశారు. తప్పు చేసినట్లు తేలితే చట్టప్రకారం ఎలాంటి శిక్షకైనా తను సిద్ధమన్నారు.

రేపో.. మాపో పార్టీ మారుతడు..

కాంగ్రెస్ పార్టీలో మహేశ్వర్‌రెడ్డి పనైపోయిందని, రేపోమాపో ఆయన పార్టీ మారుడు ఖాయమని మంత్రి ఐకేరెడ్డి ఆరోపించారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేస్తే స్పందించని మహేశ్వర్‌రెడ్డి, ఆ పార్టీ కార్యకర్తలు పోలీసులు కేసు నమోదు చేస్తే మాత్రం ధర్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తే మొదటి స్పందించింది బీఆర్‌ఎస్ పార్టీయే అన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా...!

- ఏఐసీసీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: మున్సిపల్ పోస్టుల ముడుపుల విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలుసని దీనిపై మంత్రి బహిరంగ చర్చకు సిద్ధమా.. అని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రతిసవాల్ చేశారు. మంత్రి చేసిన వ్యాఖ్యలపై మంగళవారం ఒక ప్రకటనలో ఆయన స్పందించారు. అధికారం ఉందని తనపై దొంగ కేసులు పెట్టించినా, మున్సిపల్ ఉద్యోగాల్లో ఏం జరిగిందో నిర్మల్ ప్రజలందరికీ తెలుసన్నారు. స్వయంగా అధికారపార్టీ కౌన్సిలరే అవినీతి జరిగిందని చెప్పింది, ఆర్డీవో విచారణకు ఆదేశించింది నిజం కాదా అని ప్రశ్నించారు. గత కలెక్టర్ బదిలీపై వెళ్తూ నియామకాలు రద్దు చేయడం, అభ్యర్థులు కోర్టుకు వెళ్లి పోరాటం చేస్తున్న విషయాలు వాస్తవం కాదా అని పేర్కొన్నారు. మున్సిపల్ నియామకాల్లో జరిగిన అక్రమాలను, వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

ఐదు పార్టీలు మారిన చరిత్ర నీది..

పార్టీలు మారే రాజకీయాలు తాను చేయలేదని, రెండుసార్లు ఓడిపోయినా, కష్టాలు ఎదురైనా కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నానని మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆరు నెలల్లోనే ఐదు పార్టీలు మారి, అవకాశవాద రాజకీయాలు చేసిన చరిత్ర ఇంద్రకరణ్‌రెడ్డిదే అని ఆరోపించారు. తాను పార్టీ మారాలనుకుంటే ఎవరూ అడ్డులేరని, కష్టమైనా నష్టమైనా కాంగ్రెస్ పార్టీలోనే తొమ్మిది సంవత్సరాలుగా ఉన్నానని పేర్కొన్నారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలి

- ఏప్రిల్ చివరి నాటికి మెడికల్ కాలేజీ పనులు పూర్తి చేయాలి
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

నిర్మల్‌చైన్‌గేట్:రాష్ట్రంలో ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేయబోతున్న తొమ్మిది మెడికల్ కాలేజీలకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, టీఎస్ ఎంఐడీసీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి రాష్ట్రంలో నూతనంగా నిర్మిస్తున్న వైద్య కళాశాలల పనుల పురోగతిపై ఆయా జిల్లాల కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఇంజినీరింగ్ ఏజెన్సీలు, ప్రజా ప్రతినిధులతో మంగళవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారన్నారు. అందులో భాగంగా గత సంవత్సరం 8 నూతన వైద్య కళాశాలలు ప్రారంభించుకున్నామని తెలిపారు. ఈ ఏడాది 9 కళాశాలలు ప్రారంభించే దిశగా పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. దేశంలో ప్రతి లక్ష జనాభాకు అందుబాటులో ఉన్న ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యలో తెలంగాణ అగ్రగామిగా ఉందన్నారు.



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ప్రస్తుతం కరీంనగర్, కామారెడ్డి, జనగామ, వికారాబాద్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, రాజన్న సిరిసిల్ల, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలో నూతన వైద్య కళాశాల పనుల జరుగుతున్నాయని వివరించారు. వీటిపై కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతీరోజు పనులు పురోగతి తెలుసుకుంటూ క్షేత్రస్థాయిలో వచ్చే చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఎన్ఎంసీ తనిఖీలకు సిద్ధంగా ఉండాలి...

రాష్ట్రంలో నిర్మించే తొమ్మిది వైద్య కళాశాల పనులను జాతీయ వైద్య కమిషన్ పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తుందని తెలిపారు. ఇప్పటికే ఆరు కళాశాలల పనులను క్షేత్రస్థాయిలో ఎన్ఎంసీ పరిశీలించిందన్నారు. ఆసిఫాబాద్, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల్లో ఎన్ఎంసీ పర్యటన త్వరలోనే ఉంటుందని తెలిపారు. కలెక్టర్లు, వైద్యశాఖ అధికారులు సమావేశం నిర్వహించుకుని ఎన్ఎంసీ తనిఖీలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వైద్య కళాశాలలో అవసరమైన సామగ్రి అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. టీచింగ్ స్టాఫ్, అసోసియేట్ ప్రొఫెసర్ల , మిగిలిన స్టాఫ్ నియామక ప్రక్రియ నెలన్నర కాలంలో పూర్తి చేస్తామన్నారు. వైద్య కళాశాలల నిర్మాణానికి ఏప్రిల్ చాలా కీలకమని, నెలాఖరు వరకు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జూలై నుంచి మొదటి విడత అడ్మిషన్స్ ప్రారంభమవుతాయని తెలిపారు.

మే 15 వరకు పూర్తిచేస్తాం

జిల్లా ఆస్పత్రిలో ప్రస్తుతం 100 పడకలు అందుబాటులో ఉన్నాయని, 125 అదనపు పడకల ఏర్పాటు కోసం 11 కోట్లతో భవన నిర్మాణ పనులు చేపట్టి 40 శాతం పూర్తి చేశామని కలెక్టర్ వరుణ్‌రెడ్డి తెలిపారు. మెడికల్ కాలేజ్ పనులు 55 శాతం పూర్తయ్యాయని వెల్లడించారు. మే 15 వరకు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. జూమ్ మీటింగ్‌లో అదనపు కలెక్టర్ రాంబాబు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీడీఎస్.ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ధనరాజ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం



మామడలో అభివాదం చేస్తున్న మంత్రి, నాయకులు



బంజారాలతో కలిసి నృత్యం చేస్తున్న ఐకేరెడ్డి

- రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నిధులు ఇవ్వడం లేదు
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

మామడ:సంక్షేమ పథకాలు అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర అటవీ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మామడ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వైఫల్యాలను సీఎం కేసీఆర్ ఎత్తి చూపడంతోనే కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రాజెక్టుల నిర్మాణంతో సాగు పెరిగి దిగుబడులు పెరిగి రైతులు సంతోషంగా ఉన్నారని వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్, రైతుబీమా, రైతుబంధు వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రైతుకు అండగా నిలిచిందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, ఆసరా ఫించన్లు అందిస్తున్నామని వివరించారు. హైలెవల్ కెనాల్ నిర్మాణం పూర్తి చేసి మామడ మండలంలోని గుట్టల మీది గ్రామాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు.

సిలిండర్ ధరలు పెంచుతూ పేదలపై భారం..

కేంద్ర ప్రభుత్వం సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ పేదలను ఇబ్బంది పెడుతోందని, భారం మోపుతోందని మంత్రి ఆరోపించారు. రాష్ట్రంలో అకాల వర్షాలకు నష్టం జరిగినా కేంద్రం నష్టపరిహారం అందించలేదని, రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ఇస్తుందని తెలిపారు.

పొన్కల్ మండలం కోసం కృషి..

మండలంలోని అతిపెద్ద గ్రామపంచాయతీ పొన్కల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని మండల సాధన సమితి నాయకులు మంత్రి ఐకేరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పొన్కల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రయాణికుల చెంతకే ఆర్టీసీ సేవలు



బస్సు పాసులు అందిస్తున్న అధికారులు

భైంసారూరల్: ప్రయాణికుల చెంతకే ఆర్టీసీ సేవలు ఉంటాయని ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి అన్నారు. భైంసా మండల పరిషత్ సమావేశ మందిరంలో దివ్యాంగుల కోసం మంగళవారం ఏర్పాటు చేసిన రాయితీ బస్సుపాస్ మేళాకు హాజరై మాట్లాడారు. ప్రయాణికులను ఆర్టీసీ బస్సులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తాయన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఇలాంటి పథకాలు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. 30 మంది దివ్యాంగులకు 50 శాతం రాయితీపై పాసులు అందించారు. కార్యక్రమంలో భైంసా ఆర్టీసీ డీఎం అమృత, ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి, నాయకులు గణేశ్ పాల్గొన్నారు.

వీవోఏల శ్రమ దోపిడీ?



నిర్మల్‌లో అధికారికి సమ్మె నోటీసు అందజేస్తున్న వీవోఏలు

- సేవలందిస్తున్నా వేతనాల్లేవ్..
- పనిభారంతో సతమతం
- సమస్యలు పరిష్కరించాలని ఆందోళనలు
- వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

నిర్మల్‌చైన్‌గేట్/కుంటాల: పనిభారంతో సతమతమవుతున్నా.. సహనంతో సేవలందిస్తున్నా.. ప్రభుత్వం ఐకేపీ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ల(వీవోఏ)ను పట్టించుకోవడం లేదు. డ్వాక్రా సంఘాలు ఏర్పడిన తొలినాళ్ల నుంచి నేటికీ వారికి గౌరవ వేతనం చెల్లించడం లేదు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల వేతనం చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని వీవోఏలు ఈనెల 25న సమ్మె చేశారు.

స్వయం సహాయక సంఘాల సమన్వయంలో కీలకం..

స్వయం సహాయక సంఘాలను క్షేత్రస్థాయిలో సమన్వయం చేయడంలో వీవోఏల పాత్ర కీలకం. సభ్యుల్లో క్రియాశీలకంగా ఉన్న ఒకరిని ఎంపిక చేసి ఈ బాధ్యతలు అప్పగిస్తారు. పొదుపు సంఘాల కార్యకలాపాల్లో పనిచేసే వీవోఏ, పట్టణ రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)లకు ప్రతినెలా చెల్లించే గౌరవ వేతనం తక్కువగా ఉంది. పొదుపు సంఘాల్లో ఎక్కువగా నిరక్షరాస్యులు కావడంతో ఆర్థిక లావాదేవీలు, నెలవారీ సమావేశాలు తీర్మానాలు తదితర అంశాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయడం, బ్యాంకు అధికారులతో మాట్లాడి పొదుపు సంఘాలకు రుణాలు ఇప్పించడం వీవోఏలు, ఆర్పీలు నిర్వహిస్తుంటారు. కొత్త సంఘాల ఏర్పాటు, దివ్యాంగుల సంఘాల ఏర్పాటు, చిన్న సంఘాల బుక్స్ రాయడం, సమావేశాలు, సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం, బ్యాంకు, స్త్రీనిధి రుణాల మంజూరు, మొబైల్ డేటా ఎంట్రీ, సభ్యుల ఆధార్ కార్డు బ్యాంక్ అకౌంట్లను సరిచేయడం, సేంద్రియ, సుస్థిర వ్యవసాయం, జాతీయ గ్రామీణ జీవనోపాధులు, ఆరోగ్య పోషణ, నిరుద్యోగులను గుర్తించి, జాబ్ మేళాలో ఉపాధి కల్పించడం తదితర విధులను నిర్వర్తిస్తున్నారు. ఇంత కష్టపడుతున్నా ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని వీవోఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టార్గెట్ చేరుకుంటేనే జీతం...

పొదుపు సంఘాలకు సంబంధించిన పనులు, పుస్తకాలు రాయడం, మినిట్స్ బుక్స్, వేలిముద్రలు తీసుకోవడం, ఆన్లైన్‌వర్క్ అప్‌లోడ్ చేయడం ఇలా అదనపు పనిభారాన్ని వీవోఏలపై మోపుతున్నారు. నయాపైసా ఇవ్వకుండా ఏళ్లుగా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పైపెచ్చు ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేసిన వారికి మాత్రమే జీతాలు.. మిగతా వారికి నిరాశే ఎదురవుతోంది. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ, అభివృద్ధి పనుల్లో వీరి సేవలను అధికారులు వినియోగించుకుంటున్నారు.

రూ.3,900 గౌరవ వేతనం..

జిల్లాలో మొత్తం 504 మంది వీవోఏలు ఉన్నారు. వీరు 11,982 స్వయం సహాయక సంఘాలు, 1,33,970 మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వందశాతం ఆన్‌లైన్ వర్క్ పూర్తి చేసిన వారికి ప్రభుత్వం నెలకు కేవలం రూ.3,900 గౌరవ వేతనం చెల్లిస్తుంది. పేదరికంలో ఉన్న మహిళలను 20 ఏళ్లుగా పోగుచేసి సంఘాలు ఏర్పాటు చేసిన ఐకేపీ వీవోఏలకు ప్రభుత్వం గౌరవ వేతనం సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపిస్తున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు ఈనెల 27 నుంచి సమ్మె బాట పట్టారు. డీఆర్డీవోతోపాటు ఏపీఎంలకు నోటీసులు అందించారు.

డిమాండ్లు ఇవీ..

- సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి.
- కనీస వేతనం రూ.26 వేలు,
- రూ.10 లక్షల సాధారణ బీమా సౌకర్యం కల్పించాలి.
- ఆన్‌లైన్ పనులు రద్దుతోపాటు సెర్ప్ నుంచి ఐడీ కార్డులు ఇవ్వాలి.
- మహిళా సంఘాల సభ్యులకు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలి.
- సంఘాలకు బ్యాంక్ వీఎల్ఆర్ డబ్బులు ఇవ్వాలి.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి..



20 ఏళ్లుగా మహిళా సంఘాల అభివృద్ధికి పాటుపడుతున్నాం. ప్రభుత్వం కనీస గౌరవ వేతనం ఇవ్వడం లేదు. ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

– సాయన్న, వీవోఏ

వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలి



నిత్యం స్వయం సంఘాల మహిళల బలోపేతానికి కృషి చేస్తున్నాం. మహిళలకు రుణాలు ఇప్పించడంతోపాటు పొదుపుపై అవగాహన కల్పించి వాటిని చెల్లించేలా చర్యలు చేపడుతున్నాం. 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. కనీస వేతనాలు చెల్లించి వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలి.

– జయశీల, వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు

సమస్యలు పరిష్కరించాలి

ఐకేపీ సంఘాల్లో కీలకంగా విధులు నిర్వహిస్తున్న వీవోఏల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవాలి. ఎన్నో ఏళ్లుగా తక్కువ వేతనానికి పని చేస్తున్నాం. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలి. – గోదావరి, వీవోఏ

సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయొద్దు

- డీఎస్పీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: సోషల్ మీడియాలో ప్రార్థన స్థలాలు, దేవాలయాలపై రెచ్చగొట్టే పోస్టులు పెట్టి, అసత్య ప్రచారాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి, రంజాన్ పండుగపై ఉత్సవ కమిటీలతో మంగళవారం వేర్వేరుగా శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ముఖ్యంగా శ్రీరామనవమి ర్యాలీ, హనుమాన్ జయంతి ర్యాలీ, రంజాన్ పండుగలను మతసామరస్యంతో స్నేహపూర్వకంగా జరుపుకోవాలని సూచించారు. ఎవరూ సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లు, వివిధ పోస్టులను నమ్మి ఆవేశాలకు లోనై శాంతి భద్రతలకు భంగం కలిగించొద్దని తెలిపారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ సీఐ మల్లేశ్, శ్రీరామనవమి ఉత్సవ సమితి సభ్యులు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

'పోషణ్ పక్వాడ' పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



సమావేశానికి హాజరైన అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అధికారులు, సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పోషణ్ పక్వాడ పక్షోత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌కే.రసూల్‌బీతో కలిసి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. చిరుధాన్యాలతో లాభాలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. చిరుధాన్యాల్లో ఉండే పోషక విలువలు పూర్తిస్థాయిలో అంగన్‌వాడీ టీచర్లకు వివరించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికీ వెళ్లి పిల్లల ఎదుగుదలను మానిటర్ చేయాలని, సూపర్‌వైజర్ ప్రతీ అంగన్వాడీ కేంద్రాలను సందర్శించాలన్నారు. జిల్లాలో 6 నెలల నుంచి 5 ఏళ్లలోపు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ రూపొందించిన స్వస్థ్ బాలక్-హెల్తీ చైల్డ్ కార్యక్రమాన్ని ప్రణాళికబద్ధంగా అమలు చేయాలని ఆదేశించారు. శ్యామ్ మామ్ పిల్లలను గుర్తించి వారికి పోషకాహారం అందించాలని సూచించారు. సొంత భవనాలు, తాగునీటి సమస్య ఉన్న కేంద్రాల వివరాలు సంబంధిత అధికారులకు అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి విజయలక్ష్మి, డీఆర్డీవో విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెరుకు పంట దగ్ధం



దగ్ధమైన చెరుకుపంట

గుడిహత్నూర్: మండలంలోని తోషం గ్రామానికి చెందిన రవీందర్ పస్తాపురే చేనులో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎకరంలో సాగుచేసిన చెరుకుపంట పూర్తిగా దగ్ధమైంది. దీంతో పాటు డ్రిప్ ఇరిగేషన్ పైప్‌లైన్ కూడా కాలిబూడిదైంది. దీంతో రూ.2 లక్షల వరకు నష్టపోయినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. చెరుకు పంటపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగల వల్లే ఈ ప్రమాదం జరిగిందని, తన నష్టాన్ని ఆయా శాఖ పూరించాలని కోరారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ లైన్‌మెన్ బాలాజీ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణాలు పరిశీలించారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపించి రైతును ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని బాలాజీ అన్నారు.

వివాహితను వేధించిన వ్యక్తి అరెస్ట్

నిర్మల్‌టౌన్: సోషల్ మీడియా ద్వారా వివాహితను వేధించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ మల్లేష్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన దాసరి హరిసాయి కుమార్ అనే వ్యక్తి సోషల్ మీడియా ద్వారా పట్టణానికి చెందిన ఓ వివాహిత ఫొటోను మార్ఫింగ్ చేసి ఆన్‌లైన్‌లో పెడుతానని వేధించాడు. దీంతో ఆ మహిళా పట్టణ పోలీసులను ఆశ్రయించింది. వెంటనే స్పందించిన పోలీసులు ఫోన్ సిగ్నల్ ద్వారా మంగళవారం హైదరాబాద్‌లో పట్టుకుని నిర్మల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

టీవీ చానల్ స్టాఫ్ రిపోర్టర్‌పై కేసు

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ దేవాలయంపై దుష్ప్రచారం చేసిన ఓ టీవీ చానల్ స్టాఫ్ రిపోర్టర్‌పై ఆలయ అధికారుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... ఈ నెల 26వ తేదీన మధ్యాహ్నం సమయంలో ఓ టీవీ ఛానల్ స్టాఫ్ రిపోర్టర్ ఆలయ నిర్మాణ పనులు చేసే జేసీబీ ఆపరేటర్, ట్రాక్టర్ డ్రైవర్లు భోజనాలు చేసే సమయంలో వారిని బూతులు తిడుతూ వీడియోలు తీసి తన ఛానల్‌లో గర్భాలయంలో కాంట్రాక్టర్ దావత్ అని ప్రచారం చేశాడు. ఇలా ప్రచారం చేయడంతో దేవాలయ ప్రతిష్టకు భంగం కలగడమే కాకుండా భక్తుల మనోభావాలు దెబ్బతీశారని ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నూతన నియామకం

నార్నూర్: మండలంలోని మాన్కాపూర్ గ్రామానికి చెందిన పెందూర్ దీపక్ జైభారత్ ఎస్టీ పోరాట వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న సంగారెడ్డి జిల్లాలో జైభారత్ సామాజిక విప్లవ రణభేరి కార్యక్రమంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ పోరాట వేదిక కార్యవర్గాన్ని ఎన్నుకున్నారన్నారు. గిరిజనుల అభివృద్ధి, ఆదివాసుల హక్కుల కోసం పోరాటం చేస్తానని తెలిపారు. పీడిత వర్గాల ప్రజల సంక్షేమం కోసం విద్యాభివృద్ధి కోసం మహనీయుల బాటలో సమైక్యత దిశగా నిరంతరం కృషి చేస్తానన్నారు.



ఆధార్ కార్డు కోసం మీసేవ కేంద్రానికి వచ్చిన ప్రజలు (ఫైల్)

ఆధార్ సవరణకు ఆధారం తప్పనిసరి



ఆధార్ కార్డు

- మారిన దరఖాస్తు విధానం
- యూఐడీఏఐ మార్గదర్శకాలు జారీ

నేరడిగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ మనిషికి ఆధార్ కార్డు ఉండాలని నిబంధన పెట్టాయి. ఆధార్ కార్డు ఉంటేనే లబ్ధిదారులకు సంక్షేమ పథకాల మంజూరు, భూముల రిజిస్ట్రేషన్, బ్యాంక్ పాస్‌బుక్, ఉపాధిహామీ పనులు చేయాలన్నా ఆధార్‌కార్డు తప్పనిసరి. భూములు అమ్మాలన్నా, కొనాలన్నా ఆధార్ కార్డు ఉండాల్సిందే. విద్యార్థులపై చదువులకు సంబంధించి కుల ధ్రువీకరణ పత్రానికి, స్కాలర్‌షిప్‌లకు, రైతులు పండించిన వివిధ రకాల పంటలను అమ్ముకునేందుకు ఆధార్‌కార్డు తప్పనిసరిగా మారింది. అలాగే బ్యాంకులో రుణాల మంజూరుకు ఆధార్ అనుసంధానం చేస్తుంది. ఆధార్ కార్డులో సవరణలతో జరుగుతున్న మోసాలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో వీటిలో సవరణలను సులభంగా చేసుకునే వీలుండేది. మోసాలను అరికట్టడంలో భాగంగా ఇప్పుడు వాటికి కావాల్సిన ధ్రువపత్రాలు, వయస్సును బట్టి కేటగిరీల వారీగా సమర్పించే పత్రాల్లో మార్పులు చేస్తూ ఇటీవల యూఐడీఏఐ నిర్ణయం తీసుకుంది. సరవణల్లో సరికొత్త మార్పులు చేస్తూ దరఖాస్తు విధానాన్ని మార్చింది.

పేరులో మార్పులు చేయాలంటే..

పేరులో మార్పుచేర్పులు చేయాలంటే తప్పనిసరిగా ఫొటో ఉన్న ధ్రువ పత్రం సమర్పించాలి. పదో తరగతి మెమో, పాన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, ఉపాధి హామీ జాబ్ కార్డు, సదరం సర్టిఫికెట్‌లలో ఏదో ఒకటి జతపర్చాలి. ఉద్యోగులు వారి గుర్తింపు కార్డు, వివాహితులైతే వివాహ ధ్రువ పత్రం, తహశీల్దార్‌చే జారీ చేసే కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించవచ్చు.

మూడు కేటగిరీలుగా విభజన..

ఆధార్ కార్డులో సవరణలు చేసుకునే వారిని వయస్సును బట్టి మూడు కేటగిరీలుగా విభజించారు. గతంలో ఈ విభజన ఉండేది కాదు. రెండు రకాల దరఖాస్తు పత్రాలు ఉండేవి. తాజాగా ఐదేళ్ల లోపు చిన్నారులను మొదటి, 5 నుంచి 18 ఏళ్ల లోపు వారిని రెండో కేటగిరిగా, 18 ఏళ్లు పైబడిన వారిని మూడో కేటగిరీగా చేశారు. వీరికి మూడు రకాల దరఖాస్తు పత్రాలను పెట్టారు.


బర్త్‌డే డేట్ మార్పు కోసం..

గతంలో పుట్టిన తేదీని మార్చుకునేందుకు నమూనా పత్రాన్ని భర్తీ చేసి గెజిటెడ్ అధికారితో సంతకం చేయిస్తే సరిపోయేది. పాన్ కార్డులో ఉన్న పుట్టిన తేదీని అధికారికంగా ధ్రువీకరించుకునే వీలు ఉండేది. చిన్నారులకైతే తప్పనిసరిగా మున్సిపల్ లేదా గ్రామపంచాయతీ నుంచి జారీ చేసిన బర్త్‌డే సర్టిఫికెట్ సమర్పించాలి. ఇది కూడా ఒక్కసారి మా త్రమే సవరించుకోవచ్చు. రెండోసారి మార్పు చేసుకోవాలంటే ఢిల్లీలోని కార్యాలయానికి వెళ్లి తగిన వివరణ ఇస్తూ ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

పదేళ్లకోసారి అడ్రస్ అప్‌డేట్...

ఆధార్ కార్డును పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. అడ్రస్, స్థానికతను నిర్ధారించుకుంటూ నమోదు చేసుకోవాలి. అందుకు కావాల్సిన చిరునామా ధ్రువీకరణను జత చేయాలి. ఇంతకుముందు గెజిటెడ్ అధికారి సంతకంతో పేరు, తండ్రిపేరు, చిరునామా, పుట్టిన తేదీ మార్పు చేసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ జారీచేసే గుర్తింపు పత్రాన్ని చూపాలి. ఓటరు గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్, బ్యాంక్ పాస్‌బుక్, రేషన్ కార్డులో సరైన చిరునామా ఉంటే వాటితో సరిచేసుకోవచ్చు. నీటి పన్ను, విద్యుత్, టెలిఫోన్ బిల్లు, గ్యాస్ కనెక్షన్ ధ్రువపత్రాలు వినియోగించుకోవచ్చు.

నిబంధనలు పాటించాలి



ఆధార్ కార్డు అప్‌డేట్‌లో పేరుతో చేసే మార్పుల ద్వారా జరిగే మోసాలను అరికట్టేందుకు తాజాగా యూఐడీఏఐ జారీ చేసిన ఆదేశాలను ఆధార్ కేంద్రాల వారు పాటించాలి. నిబంధనల ప్రకారం ప్రజలు సరైన ధ్రువపత్రాలు తీసుకుని అప్‌డేట్ చేసుకోవాలి. ఇది ఒకసారి మాత్రమే చేసుకోవచ్చు. గతంలో మాదిరిగా మళ్లీ మళ్లీ మార్చుకునే వీలులేదన్న విషయాన్ని గ్రహించాలి.

– రవి, ఈడీఎం, ఆదిలాబాద్ జిల్లా

జెండర్ తప్పుగా నమోదైతే ఒకేసారి ఛాన్స్..

ఆధార్ కార్డులో జెండర్ (లింగం) తప్పుగా నమోదైతే ఒక్కసారి మాత్రమే మార్చుకునే వీలుంది. ఇందుకు తప్పనిసరిగా అర్హతగల గుర్తింపు పత్రాన్ని జత చేయాలి. మరోసారి తప్పును సవరించాలంటే ప్రధాన కార్యాలయానికి వెళ్లాల్సిందే.

బ్యాంకులో అగ్ని ప్రమాదం



బ్యాంకులో అలుముకున్న పొగ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంచిర్యాల్ రోడ్డులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏఎన్‌రెడ్డి బ్రాంచ్‌లో ప్రమాదవశాత్తు మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఉదయం బ్యాంకులో సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన బ్యాంకు అధికారులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అంతలోగా వారి దగ్గర ఉన్న ఫైర్ సేఫ్టీతో కొద్దిపాటి మంటలు ఆర్పివేశారు. అంతలో అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు పూర్తిగా ఆర్పి వేశారు. ఈ ప్రమాదంలో బ్యాంకులోని పలు డాక్యుమెంట్లు దగ్ధమయ్యాయి. ఎవరికి ఎటువంటి అపాయం, ఆస్తి నష్టం జరగలేదు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 39మందికి జరిమానా



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్సై

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 39మందికి జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు నిర్మల్ పట్టణ ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పలువురు పట్టుబడగా వారిని నిర్మల్ కోర్టులో హాజరు పరిచారు. 39 మందికి రూ.4,7300 జరిమానా విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కేంద్రం

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు
- రాహుల్‌పై వేటుకు నిరసనగా ఖానాపూర్‌లో కాంగ్రెస్ దీక్ష



నిరసన దీక్షలో మాట్లాడుతున్న వెడ్మ బొజ్జు

ఖానాపూర్: పార్లమెంట్‌ను, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయనాయకుడు రాహుల్‌గాంధీపై వేటుకు నిరసనగా నియోజకవర్గంలో మంగళవారం పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో నిరసన దీక్షా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభిప్రాయ ప్రకటనకు వీలులేని స్వాతంత్ర్యం నిరర్థకమని అన్నారు. పౌరుల సమావేశ స్వేచ్ఛకు, చర్చలకు అవకాశం కల్పించని వ్యవస్థలు ఎందుకని ప్రశ్నించారు. అలా లేనప్పుడు దేశ సామాజిక వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి అంతకన్నా పెద్ద ప్రమాదం మరొకటి లేదని వివరించారు. బహిరంగ చర్చలు, నిర్ణయాలు ప్రజల రాజకీయ కర్తవ్యమని, దానిని మరిచిపోవద్దన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణాధ్యక్షుడు దయానంద్, నిమ్మల రమేష్, నాయకులు మడిగెల గంగాధర్, తోట సత్యం, యూసుఫ్ ఖాన్, చిన్నం సత్యం, జహీర్ అహ్మద్, గంగనర్సయ్య, లక్ష్మీరాజం, రాసమల్ల అశోక్, దాసరి రమేష్ ఉన్నారు.

కోగ్ధూర్‌లో హనుమన్ విగ్రహం మాయం

బేల: మండలంలోని కోగ్ధూర్ గ్రామంలో ఈ నెల 14న ప్రభుత్వ స్థలంలో గ్రామస్తులంతా సమిష్టిగా హనుమన్ విగ్రహాన్ని ప్రత్యేక పూజలతో ప్రతిష్ఠించుకున్నారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆ హనుమన్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు మాయం చేయడంతో కలకలం రేపింది. దీంతో మంగళవారం ఉదయం గ్రామస్తులు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. విగ్రహాన్ని మాయం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి చట్టా రీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. దీంతో పోలీస్‌స్టేషన్ వద్ద కొంతసేపు తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెంటనే సర్కిల్ సీఐ కోల నరేష్‌కుమార్, ఆర్ఐ గీతలు అక్కడికి చేరుకుని సంఘటపై గ్రామస్తులతో మాట్లాడి ఆరా తీశారు. ఈ క్రమంలోనే విశ్వహిందూ పరిషత్ జిల్లా, మండల బృందాలు అక్కడికి చేరుకున్నాయి. వీరి చొరవతో గ్రామస్తులు సమిష్టిగా నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో సాయంత్రం ఆందోళనలు సద్దుమణిగాయి.

అక్రమాల ‘ఉపాధి’

- ప్రజావేదికలో వెల్లడించిన డీఆర్డీవో
- రూ.2,08,230 నిధులు రికవరీ చేస్తామని వెల్లడి
- రూ.25లక్షల నిధులతో చేపట్టిన పనులపై వెరిఫికేషన్‌కు ఆదేశం



ప్రజావేదిక నిర్వహిస్తున్న డీఆర్డీవో

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో రెండ్రోజుల పాటు నిర్వహించిన 13వ విడత ఉపాధి హామీ ప్రజావేదికలో భారీగా అవినీతి అక్రమాలు బయటపడ్డాయి. అనేక గ్రామాల్లో చేయని పనులు చేసినట్లు తప్పుడు రికార్డులు సృష్టించిన అధికారులు, సిబ్బంది పలు చోట్ల బినామి పేర్లతో సైతం డబ్బులు కాజేసినట్లు వెల్లడైంది. మండలంలోని అనేక గ్రామాల్లో కూలీల నుంచి వారానికి రూ.100 ఆపైన వసూలుకు బాధ్యులైన మేట్లను తొలగించినట్లు డీఆర్డీవో విజయలక్ష్మి వెల్లడించారు. మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో 2019 నుంచి మార్చి 2022 వరకు రూ.17.75 కోట్ల విలువ చేసే పనులు జరిగాయని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం అవినీతి, అక్రమాలపై సామాజిక తనిఖీ చేపట్టి ప్రజావేదికలో గుర్తించినట్లు తెలిపారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారి నుంచి రూ.లక్షా 94వేలా 230 రికవరీ చేయిస్తామని తెలిపారు. పలు పనుల్లో పర్యవేక్షణ లోపం తదితర కారణాలతో బాధ్యులైన వారికి రూ.14వేల జరిమానా విధించామన్నారు. రూ.25లక్షలతో చేపట్టిన ఉపాధి పనులపై క్వాలిటీ కంట్రోల్ ద్వారా రీ–వెరిఫికేషన్ చేసేందుకు ఆదేశించినట్లు ప్రకటించారు. రూ.2లక్షల పనులకు సంబంధించిన రికార్డులు అందలేదని వాటిని త్వరలోనే స్వాధీనం చేసుకుని పనులపై తిరిగి విచారణ చేస్తామన్నారు.

12వ విడతలో రూ.లక్షకుపైగా నిధుల రికవరీ

గతంలో నిర్వహించిన 12వ విడత ప్రజావేదికలో రూ.3లక్షలా 3వేలా 72 నిధుల దుర్వినియోగం జరిగిందని డీఆర్డీవో విజయలక్ష్మి తెలిపారు. వాటిలో నుంచి గత కొద్ది నెలల క్రితం ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా రూ.లక్షా 32వేలా 720 రికవరీ చేయించినట్లు తెలిపారు. మరో రూ.1,70,352 రికవరీ చేయాల్సి ఉందన్నారు. నిబంధనల ప్రకారం పనిచేసే ప్రతీ కూలీకి డబ్బులు నేరుగా వారి ఖాతాల్లో పడతాయని, అందుకోసం మేట్లు, అధికారులు, సిబ్బందికి ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దన్నారు. ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలపై ఈజీఎస్ అధికారులు, సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శుల తీరుపై డీఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఎంటీ దత్తు, హెచ్ఆర్ సుధాకర్, ఎంపీడీవో మల్లేష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

దిలావర్‌పూర్: మండలంలోని సిర్గాపూర్ గ్రామ సమీపంలో నిర్మల్–భైంసా రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. మృతుడు రోడ్డు మార్గంలో వెళ్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కొన్ని రోజులుగా సిర్గాపూర్ గ్రామ బస్టాండ్ సమీపంలో మతిస్థిమితం లేకుండా సంచరిస్తున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఉపాధ్యాయులకు ఉచితంగా సార్ సినిమా

నిర్మల్‌రూరల్: లెక్చరర్ నేపథ్యంలో తెరకెక్కిన సార్ సినిమాను జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉచితంగా ప్రదర్శించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాల్‌లకు ఈ సినిమాను ఉదయం 8 నుంచి 10:30 వరకు జిల్లా కేంద్రంలోని తిరుమల థియేటర్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. బుధవారం ఒక్కో పాఠశాల నుంచి ఇద్దరు లేదా ముగ్గురు ఉపాధ్యాయులకు, జూనియర్ కళాశాల లెక్చరర్లకు ఈ ప్రత్యేక ప్రదర్శన ఉంటుందని డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు.

సెల్‌ఫోన్ చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో రోజురోజుకూ దొంగతనాలు పెరిగిపోతున్నాయి. ఇటీవల ఓ మహిళ మెడలోంచి బైక్‌పై వచ్చి చైన్‌ను దొంగతనం చేసిన విషయం మరువకముందే.. నడుచుకుంటు వెళ్తున్న వ్యక్తి జేబులోంచి సెల్ ఫోన్‌ను చోరీ చేసిన ఘటన పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ వివరాల ప్రకారం... పట్టణంలోని ఖైజవాన్‌నగర్‌కు చెందిన షేక్ మోయిన్ తన బంధువుతో కలిసి పంజాబ్ చౌక్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్‌పై వచ్చిన ఓ దుండగుడు జేబులో నుంచి సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయాడు. దీని విలువ రూ.10వేల వరకు ఉంటుందని, దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై పేర్కొన్నారు.

బైక్‌తో ఢీకొట్టిన వారిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: బైక్‌తో ఢీకొట్టి దాడి చేసిన పలువురిపై టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్సై విష్ణు ప్రకాశ్ వివరాల ప్రకారం... ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మోసిన్ షరీఫ్ పిట్టలవాడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఆయన భార్య సల్మాతో విభేదాల కారణంగా కోర్టులో వరకట్న కేసు కొనసాగుతోంది. ఆమెకు మెయింటెనెన్స్ కింద నెలకు రూ. 10 వేల చొప్పున అందజేస్తున్నాడు. భార్యతో పాటు ఆమె సోదరులు, బంధువులు ఒకేసారి రూ.25 లక్షలు ఇవ్వాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. లేకుంటే చంపేస్తామని బెదిరిస్తున్నారు. కోర్టు కేసులో భాగంగా మంగళవారం మోసిన్‌తో పాటు ఆయన భార్య, బావమరదులు కోర్టుకు వచ్చారు. తిరిగి వెళ్తుండగా కోర్టు సమీపంలో విద్యాంగుడైన మోసిన్‌ను ద్విచక్ర వాహనంతో బావమరిది ఢీకొట్టాడు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాజేశ్



సునారికారి రాజేశ్

కడెం: ఈనెల 25 నుంచి 27 మంచిర్యాలలో నిర్వహించిన ఐఎఫ్‌టీయూ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ గ్రామానికి చెందిన సునారికారి రాజేశ్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు.

‘అసలు దోషులను తప్పిస్తున్నారు’



సమావేశంలో మాట్లాడుతున్న సుహాసిని రెడ్డి

ఆదిలాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో అసలు దోషులను తప్పిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, నిరుద్యోగ పోరాట సమితి గౌరవాధ్యక్షురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో మంగళవారం నిరుద్యోగ పోరాట సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణలో పేపర్ లీకేజీ ఘటన వల్ల నిరుద్యోగులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. ఈ ఘటనలో కిందిస్థాయి ఉద్యోగులను దోషులుగా చూయించి, అసలు దోషులను తప్పిస్తున్నారని, వెంటనే వారిని శిక్షించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ ఏప్రిల్ 1వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఒక్క రోజు దీక్షను చేపడుతున్నట్లు, దీక్షకు నిరుద్యోగులు మద్దతు పలకాలని కోరారు. నిరుద్యోగ పోరాట సమితి కన్వీనర్ మల్లయ్య, కో కన్వీనర్ సంజీవరెడ్డి, సాగర్, దత్తు, సాయి, ఉదయ్ పాల్గొన్నారు.

31లోగా పట్టాల కోసం డీడీలు కట్టాలి



మాట్లాడుతున్న మధుసూదన్‌నాయక్

రామకృష్ణాపూర్: సింగరేణి స్థలాల్లో ఇండ్లు నిర్మించుకుని పట్టాలు పొందాలనుకునేవారు ఈ నెల 31తేదీలోపు డీడీలు చెల్లించాలని అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ తెలిపారు. మంగళవారం క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యులతో సమీక్షా నిర్వహించారు. జీవో నెం 76 ప్రకారం సింగరేణి స్థలాల్లో ఇండ్లు నిర్మించుకున్నవారు రామకృష్ణాపూర్ పట్టణంలో దాదాపు అందరూ డీడీలు కట్టి రిజిస్ట్రేషన్‌లు కూడా పూర్తి చేసుకున్నారని, ఇంకా 555 మంది డీడీలు కట్టాల్సి ఉందని పేర్కొన్నారు. ఇదివరకే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 31 తర్వాత మళ్లీ అవకాశముండదని, 555 మంది డీడీలు కట్టేలా ఆయా వార్డుల కౌన్సిలర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. మంచిర్యాల ఆర్డీవో వేణు, మందమర్రి తహసీల్దార్ సంపతి శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ కళ ఉన్నారు.

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో రాసారోకో చేస్తున్న మహిళలు

జన్నారం: నీటి సమస్య పరిష్కరించాలని మండలంలోని పొనకల్ శ్రీరాంనగర్ కాలనీకి చెందిన మహిళలు మంగళవారం రామాలయం సమీపంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. వీరికి కాంగ్రెస్, సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 20 రోజులుగా నీటి కోసం ఇబ్బందులు పడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నల్లాలు బిగించి ట్యాంక్ నుంచి నీరు సరఫరా చేయడం లేదని వాపోయారు. ఎండలు ముదురుతుండగా నీటి సమస్య ఎక్కువైందని తెలిపారు. ఉన్నతాధికారులు వచ్చి సమస్య పరిష్కరించేదాకా ఆందోళన విరమించబోమని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై సతీశ్ అక్కడికి చేరుకుని మహిళలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు ససేమిరా అన్నారు. కాగా, రెండురోజుల్లో నీటి సమస్య పరిష్కరిస్తామని ఎంపీపీ సరోజన ఫోన్‌లో హామీ ఇవ్వగా వారు రాస్తారోకో విరమించారు. వివిధ పార్టీల నాయకులు ఫసీఉల్లా, రాజన్న, కాలనీవాసులు రాజన్న, సందకృష్ణ, మల్లయ్య, చిలువేరు గంగమణి, పిల్లి సుజాత, సంద వనిత, మహిళలు పాల్గొన్నారు.